సాక్షి జగిత్యాల

శుక్రవారం । 13 । సెప్టెంబర్ । 2024



ఛత్రపతి శివాజీ ధైర్యశీలి

జగిత్యాలరూరల్: ఛత్రపతి శివాజీ ధైర్యశీలి అని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బోగ శ్రావణి అన్నారు. సంగంపల్లిలో ఏర్పాటు చేసిన శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరించారు.



బీఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్ట్

రాయికల్: ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డిపై దాడికి నిరసనగా మాజీమంత్రి హరీశ్‌రావు చలో కమిషనరేట్ పిలుపునిచ్చారు. ఎస్సై అశోక్ బీఆర్ఎస్ నాయకులు ఎలిగేటి అనిల్, మ్యాకల కాంతారావు, తురగ శ్రీధర్‌రెడ్డి, మహేశ్‌గౌడ్, సాయికుమార్‌ను ముందస్తుగా అరెస్టు చేశారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
31.0/23.0

వాతావరణం పొడిగా ఉంటుంది. కొన్నిచోట్ల ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఉక్కపోత పెరిగే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

విద్యార్థులను భయం ఇంకా వదలలేదా..?



ఐదో తరగతిలో 71 మందికి ఏడుగురే...

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం పెద్దాపూర్ గురుకులం విద్యార్థులను భయం వీడనట్లు కనిపిస్తోంది. పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు కొద్దిరోజుల క్రితం అస్వస్థతకు గురై మృతి చెందడంతో గురుకులానికి సెలవు ప్రకటించిన విషయం తెల్సిందే. గురుకులంలో వసతులు కల్పించి.. తరగతులు పునఃప్రారంభించినా విద్యార్థులు ఇక్కడికి రావాలంటేనే వెనుకడుగు వేస్తున్నారు. టెన్త్, ఇంటర్ విద్యార్థులు మాత్రమే తరగతులకు వస్తున్నారు. వివిధ తరగతుల విద్యార్థులు వచ్చినా వారి సంఖ్య అంతంతమాత్రంగానే ఉంటోంది. మిగతా కొందరు టీసీ తీసుకెళ్లేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది.

దళిత గ్రామంగా ఇందిరానగర్ రాష్ట్రంలోనే మొదటిది



ఇందిరానగర్ వాసులతో ఎమ్మెల్యే సంజయ్

సారంగాపూర్: బీర్‌పూర్ మండలంలోని ఇందిరానగర్ గ్రామం పూర్తిగా దళిత పంచాయతీ అని, ఇది రాష్ట్రంలోనే మొదటిదని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. గురువారం ఆయన కాలనీవాసులతో మాట్లాడారు. ఇందిరానగర్ ఇప్పటివరకు నర్సింహులపల్లె పరిధిలో ఉండేదన్నారు. ప్రస్తుతం పంచాయతీలో 100శాతం దళిత జనాభా ఉందని, ఎస్సీ సబ్‌ప్లాన్ నుంచి ప్రత్యేక నిధులు వెచ్చిస్తామని, పంచాయతీ భవనం, మురికి కాల్వలు, ఇతర వసతులు కల్పిస్తామని పేర్కొన్నారు. బీర్‌పూర్ మండలం తుంగూర్‌లో కస్తూరిబా బాలికల గురుకులాన్ని ఏర్పాటు చేస్తున్నామని, ప్రాథమిక ఆరోగ్యకేంద్రం కూడా మంజూరు చేశామని పేర్కొన్నారు. ఆయన వెంట కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ ముప్పాల రాంచందర్‌రావు, నాయకులు రమేశ్, సుశీన్, సతీశ్, నారాయణ, రవి పాల్గొన్నారు.

ఖోఖో, కబడ్డీ పోటీలకు కేజీబీవీ విద్యార్థులు



ఖోఖో, కబడ్డీ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

ఇబ్రహీంపట్నం: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన క్రీడాపోటీల్లో కేజీబీవీ విద్యార్థినులు రాణించి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. బాలికల అండర్ 14, 17 విభాగంలో ఖోఖో, కబడ్డీలో రాణించారు. అండర్–14 ఖోఖోలో వర్షకొండ విద్యార్థులు రన్నర్‌గా నిలిచారు. విన్నర్‌గా మోడల్‌స్కూల్ విద్యార్థులు నిలిచారు. అండర్–17 కబడ్డీలో మోడల్‌స్కూల్ విద్యార్థులు విన్నర్‌గా నిలిచారు.

ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు వెయిటేజీపై స్పష్టత ఇవ్వాలి

జగిత్యాలటౌన్:ల్యాబ్ టెక్నీషియన్ రిక్రూట్‌మెంట్‌లో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు వెయిటేజీపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని ఎన్‌హెచ్‌ఎం ల్యాబ్ టెక్నీషియన్ రాష్ట్ర అధ్యక్షుడు కవ్వ లక్ష్మారెడ్డి డిమాండ్ చేశారు. ల్యాబ్ టెక్నీషియన్ ఉద్యోగాల భర్తీకి సంబంధించిన నోటిఫికేషన్ అస్పష్టంగా ఉందన్నారు. ఏఎన్‌ఎంలకు సంబంధించిన నోటిఫికేషన్లో వెయిటేజీ 30 మార్కులు ఇవ్వగా.. సమాన క్యాడర్ అయిన ల్యాబ్ టెక్నీషియన్ నోటిఫికేషన్‌లో మాత్రం 20శాతం వెయిటేజి ఇవ్వడమేంటని ప్రశ్నించారు. అలాగే సర్వీస్ విషయంలో కచ్చితమైన ప్రమాణాలు పాటించాలని, లేనిపక్షంలో నకిలీ సర్వీస్ సర్టిఫికెట్లు సమర్పించే అవకాశం ఉందన్నారు. అధికారులు నోటిఫికేషన్‌ను క్షుణ్ణంగా పరిశీలించి వెయిటేజీ ఇవ్వాలని, లేకుంటే హైకోర్టును ఆశ్రయిస్తామని హెచ్చరించారు.

పొలాసలో గొర్రెలు, మేకల సర్వే

జగిత్యాల: జిల్లాలో గొర్రెలు, మేకల సర్వే పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్నారు. గురువారం జగిత్యాల రూరల్ మండలం పొలాసలో సర్వే చేపట్టి గొర్రె, పొట్టేళ్లకు చెవిపోగుతో పాటు ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. వెటర్నరీ లైవ్‌స్టాక్ ఆఫీసర్ పూర్ణచందర్ మాట్లాడుతూ భారత్ పశుదాన్ యాప్ ద్వారా గొర్రెలు, మేకల సర్వే చేపట్టడం జరుగుతుందని, పొలాసలో 14 మంది యాదవ రైతుల వద్ద 1690 గొర్రెలు, 384 గొర్రెలు ఉన్నట్లు గుర్తించామని పేర్కొన్నారు.



రోగాలు ఫుల్.. పరీక్షలు నిల్..

- పనిచేయని సీబీసీ యంత్రాలు
- జిల్లావ్యాప్తంగా నిలిచిన టెస్ట్‌లు
- ముదురుతున్న వైరల్‌ఫీవర్స్
- గ్రామీణులకు తప్పని ఇబ్బందులు

జగిత్యాల: అసలే వాతావరణంలో మార్పులు.. కురుస్తున్న భారీ వర్షాలతో చెరువులు, కుంటలు నిండాయి. అన్ని జలాశయాలకు కొత్తనీరు వచ్చి చేరింది. దీంతో రోగాలు కూడా పెరుగుతున్నాయి. ప్రతి ఇంట్లోనూ ఒకరిద్దరు విషజ్వరాలతో బాధపడుతున్నారు. ఏ ఆస్పత్రిని చూసినా మలేరియా, టైఫాయిడ్, చికున్‌గున్యా వంటి వ్యాధులతో బాధపడుతున్న వారే కనిపిస్తున్నారు. పారిశుద్ధ్యం సక్రమంగా లేకపోవడంతో జిల్లాలో వైరల్ ఫీవర్స్ ముదురుతున్నాయి. మరోవైపు ప్రజలకు టెస్ట్‌లు చేసేందుకు తెప్పించిన సీబీసీ (కంప్లీట్ బ్లడ్ కౌంట్) యంత్రాలు పనిచేయడం లేదు. జిల్లావ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉండడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు.

గ్రామీణులకు తప్పని తిప్పలు

జిల్లాలో 17 పీహెచ్‌సీ (ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు)లు ఉన్నాయి. గ్రామీణప్రాంతాల ప్రజలకు ఎక్కువగా ఈ కేంద్రాలపైనే ఆధారపడి ఉంటున్నారు. చిన్న జ్వరం వచ్చినా.. నొప్పి వచ్చినా సమీప కేంద్రాలను ఆశ్రయిస్తుంటారు. అక్కడి సిబ్బంది ఇచ్చే మందులను తీసుకెళ్తుంటారు. పల్లె ప్రజలకు పరీక్షలు చేసి మందులు ఇచ్చేలా వైద్య శాఖ అధికారులు ప్రతి కేంద్రంలోనూ సీబీసీ యంత్రాలను అందుబాటులో ఉంచింది. అయితే ప్రస్తుతం అవి పనిచేయడం లేదు. దీంతో ప్రజలు ఆర్ఎంపీలను ఆశ్రయిస్తున్నారు. మరికొందరు జ్వరాల బారినపడిన వారు జిల్లా కేంద్రానికి రావాలంటే ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికే పట్టణ ప్రాంతాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులు కిటకిటలాడుతున్నాయి.

మరమ్మతు చేయిస్తున్నాం



పీహెచ్‌సీ కేంద్రాల్లో ఉన్న సీబీసీ యంత్రాలకు మరమ్మతు చేయిస్తున్నాం. టెక్నీషియన్స్ సరిగా రావడంలేదు. ప్రజలకు ఇబ్బంది లేకుండా జిల్లాకేంద్రంలోని టీహబ్‌కు రక్తనమూనాలు పంపిస్తున్నాం. త్వరలోనే సీబీసీ యంత్రాలను బాగుచేయిస్తాం.

– సమియోద్దీన్, డీఎంహెచ్‌వో

పనిచేయని యంత్రాలు

ఏదైనా జ్వరం వచ్చినా నిర్ధారణ చేయాలంటే రక్త పరీక్షలు తప్పనిసరి. ఇది కీలకం కూడా. ఈ క్రమంలో గత ప్రభుత్వం ప్రతి ఆరోగ్యకేంద్రంలో సీబీసీ మిషన్లను అందుబాటులోకి తెచ్చింది. పీహెచ్‌సీకి వచ్చిన రోగ పీడితులకు దీనిద్వారా టెస్ట్‌లు చేసి రోగాన్ని నిర్ధారించి మందులు రాసిస్తుంటారు. ప్రతి సెంటర్‌లో ఏర్పాటుచేసిన ఈ సీబీసీ యంత్రాలు ప్రస్తుతం ఎక్కడ కూడా పనిచేయడం లేదు. గత ప్రభుత్వ హయాంలో హైదరాబాద్‌కు చెందిన హెర్బా కంపెనీ ఈ మిషన్లను అందించింది. కొద్దినెలలుగా ఈ యంత్రాలు ఏ సెంటర్‌లోనూ పనిచేయడం లేదు. యంత్రాల్లో వినియోగించే రసాయనాలు సరఫరా చేయకపోవడం.. సరిగా వాడకపోవడంతో అవి మూలనపడ్డాయి. పీహెచ్‌సీకి వచ్చిన రోగుల శాంపిళ్లను సేకరించి జిల్లా కేంద్రంలోని టీ హబ్‌కు పంపిస్తున్నారు. అయితే రిపోర్టులు సకాలంలో రాక రోగులు ఇబ్బంది పడుతున్నారు. సీబీసీ మిషన్లను మరమ్మతు చేయిస్తే రోగులకు ఎంతో వెసులుబాటు ఉంటుందన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఈ పరీక్షలతోనే ప్లేట్‌లెట్స్ ఉన్నాయి..? ఎలాంటి జ్వరం వచ్చింది..? వంటి కంప్లీట్ బ్లడ్ పిక్చర్ వస్తుంది. ఇవి పనిచేయకపోవడంతో శాంపిళ్లను సేకరించి టీహబ్‌కు పంపించడం.. అక్కడి వారు పరీక్షించి రిపోర్టులు ఇచ్చేవరకు ఆలస్యం అవుతోంది. అప్పటికే ప్రజలకు రోగం మరింత ముదురుతోంది. సీబీసీ యంత్రాలు పనిచేస్తే వెంటనే రిపోర్ట్ వస్తే రోగికి మందులు రాసే అవకాశం ఉంటుంది. ఏ రోగమైనా ఇట్టే తగ్గిపోయే అవకాశం ఉంటుంది. యంత్రాలు పనిచేయకపోయినా వైద్యశాఖ అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. ఇటీవల ప్రజల నుంచి ఫిర్యాదులు రావడంతో యంత్రాలకు సంబంధించిన టెక్నీషియన్స్ వచ్చి కొన్ని పీహెచ్‌సీల్లో చేసినప్పటికీ ఫలితం లేదని తెలిసింది. అసలే జిల్లా అంతటా జ్వరాలతో ప్రజలు విలవిల్లాడుతుంటే ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రభుత్వ ఆస్పత్రుల్లో అన్ని సౌకర్యాలు ఉండేలా చూడాల్సి ఉండగా ఎవరూ పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి సీబీసీ యంత్రాలను వెంటనే మరమ్మతులు చేయించేలా చర్యల తీసుకోవాలని కోరుతున్నారు.

రేపు డీఏవో వాణితో 'సాక్షి' ఫోన్ ఇన్



వాణి
జిల్లా వ్యవసాయాధికారి

జగిత్యాలఅగ్రికల్చర్: వరుస వర్షాలు, వరదల కారణంగా వరి, మొక్కజొన్న, పత్తి వంటి పంటలతోపాటు ఉద్యాన పంటలకూ నష్టం వాటిల్లే పరిస్థితులు ఉన్నాయి. పండ్లతోటలు సహా వరి, పత్తి, ఇతర ఆరుతడి పంటలను కాపాడుకునేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవాలనే అంశంపై 'సాక్షి' జిల్లా వ్యవసాయ అధికారి (డీఏవో) వాణితో ఈనెల 14న (శనివారం) 'ఫోన్‌ఇన్' కార్యక్రమం నిర్వహిస్తోంది. రైతులు తమ సమస్యలను ఆమె దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించే వెసులుబాటు కల్పిస్తోంది.

సమయం: ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు

ఫోన్ నంబరు : 72888 94119

ఆస్పత్రిని శుభ్రంగా ఉంచాలి



రోగులను వివరాలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ సత్యప్రసాద్

- వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి
- కలెక్టర్ సత్యప్రసాద్

జగిత్యాల: వ్యాధులు రాకుండా ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. జిల్లాకేంద్రంలోని మాతాశిశు సంక్షేమ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఆస్పత్రిలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. డాక్టర్లు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండాలని సూచించారు. అలసత్వం వహిస్తే చర్యలు తప్పవన్నారు. రోజుకు ఓపీ ఎంత..? మెరుగైన వైద్యం అందిస్తున్నారా..? అని అడిగి తెలుసుకున్నారు.

గురుకులం పాఠశాల తనిఖీ

ధర్మపురి: ప్రభుత్వ పాఠశాలల్లో మెనూ పాటించాలని కలెక్టర్ ఆదేశించారు. మండలంలోని మగ్గిడి గరుకులాన్ని సందర్శించారు. తరగతి గదులు, వంటగది, స్టోర్‌రూంను పరిశీలించారు. పరిసరాలు, టాయ్‌లెట్లు శుభ్రంగా ఉంచుకోవాలని, విద్యార్థుల ఆరోగ్యంపై జాగ్రత్త తీసుకోవాలని సూచించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



ధర్మపురిలో మాట్లాడుతున్న ప్రభుత్వవిప్ అడ్లూరి

ధర్మపురి: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. పట్టణంలోని బ్రాహ్మణ సంఘంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య, వ్యాధి నిర్ధారణ శిబిరాన్ని కలెక్టర్ సత్యప్రసాద్‌తో కలిసి ప్రారంభించారు. 47 మంది నుంచి జ్వరం, 47మంది నుంచి డెంగీ పరీక్షల కోసం శాంపిళ్లు సేకరించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే వ్యాధులు రావన్నారు. ప్రభుత్వం ఆస్పత్రుల్లో సదుపాయాలు కల్పించి నాణ్యమైన వైద్యం అందిస్తోందని తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ ఖాళీ డ్రమ్ములు, సీసాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా 230 మందికి డెంగీ పాజిటివ్‌గా నమోదు కాగా వారి ఇంటి పరిసరాల్లో స్ప్రే చేయించామన్నారు. జిల్లా వైద్యాధికారి సమియోద్దీన్, డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్, మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్తమ్మ, వైస్ చైర్మన్ రామన్న, ఇన్‌చార్జి కమిషనర్ గంగాధర్, తహసీల్దార్ కృష్ణచైతన్య, కౌన్సిలర్లు తదితరులున్నారు.

వినాయకుడికి కుంకుమపూజలు



జగిత్యాలరూరల్: జగిత్యాల అర్బన్ మండలం ధరూర్‌లోని రెడ్డి సంక్షేమ సంఘం కల్యాణ మండపంలో ప్రతిష్ఠించిన వినాయకుడికి మహిళలు గురువారం పెద్ద ఎత్తున కుంకుమపూజలు చేశారు. రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షు డు కొప్పెర వెంకట్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, నవీన్‌కుమార్‌రెడ్డి, చిన్నారెడ్డి, రాంరెడ్డి పాల్గొన్నారు.

గణనాథుడికి 108 నైవేద్యాలు



రాయికల్: రాయికల్ పట్టణంలోని మహేంద్రమ్యాదరి యువజన సంఘం ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన గణనాథుని వద్ద గురువారం అన్నదానం నిర్వహించారు. పట్టణంలోని ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన గణనాథునికి 108 రకాల నైవేద్యాలు సమర్పించి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు కూరగాయల రవి, గరిపెల్లి శ్రీనివాస్, పల్లెర్ల పవన్, మహిళాసంఘ అధ్యక్షురాలు నాగమల్ల లావణ్య పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలపై రాజీలేని పోరాటం

జగిత్యాల: పెన్షనర్ల సమస్యలపై రాజీలేనిపోరాటం చేస్తామని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గాజుల నర్సయ్య అన్నారు. గురువారం స్థానిక టీఎన్జీవో భవనంలో పెన్షనర్ల సమావేశంలో మాట్లాడారు. ఐదు పెండింగ్ డీఏలు, పీఆర్సీ ఫిట్‌మెంట్ 51 శాతం ఇవ్వాలని, కమ్యుటేషన్ 15 ఏళ్ల నుంచి 12 ఏళ్లకు కుదించాలని, అన్ని కార్పొరేట్ ఆస్పత్రుల్లో నగదు రహిత వైద్యసేవలు అందించాలని కోరారు. పెన్షనర్లకు ఆదాయ పన్ను రద్దుకు కేంద్ర ప్రభుత్వం చొరవ చూపాలన్నారు. పెన్షనర్ల జిల్లా అధ్యక్షుడు హరి అశోక్‌కుమార్, బొల్లం విజయ్, కోశాధికారి విశ్వనాథ్, సహాయ అధ్యక్షుడు హన్మంతరెడ్డి, ప్రకాశ్‌రావు, యాకుబ్, విఠల్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు గాజుల నర్సయ్య

నిమజ్జనానికి సహకరించాలి

రాయికల్: వినాయక నిమజ్జనాన్ని ప్రశాంతంగా నిర్వహించేందుకు సహకరించాలని జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ సూచించారు. గురువారం రాత్రి పట్టణంలోని వినాయక మండపాలను పరిశీలించారు. పోలీసు నిబంధనలను ఉల్లంఘిస్తే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట సీఐ కృష్ణారెడ్డి, రాయికల్ ఎస్సై అశోక్ పాల్గొన్నారు.



వినాయక మండపాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ

కోళ్ల దాణాకు రేషన్ బియ్యం

- మక్కలకు ధర పెరిగిన ఫలితం
- నెలకు వేలాది క్వింటాళ్ల తరలింపు
- పోలీసుల తనిఖీల్లో గుర్తింపు

ఇబ్రహీంపట్నం మండలం వేములకుర్తిలోని రెండు ఫౌల్ట్రీఫాం వ్యాపారులు కొంతకాలంగా రేషన్ బియ్యాన్ని కోళ్లకు దాణాగా వినియోగిస్తున్నారు. పేదలకు దక్కాల్సిన బియ్యాన్ని దళారుల నుంచి దర్జాగా కొనుగోలు చేస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఫారంలో తనిఖీలు జరిపి 125 క్వింటాళ్ల మేర బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ రెండు పౌల్ట్రీల వ్యాపారులే కాదు.. చాలామంది వ్యాపారులు కోళ్లకు మక్కల స్థానంలో రేషన్ బియ్యాన్నే వినియోగిస్తున్నారని పోలీసులు గుర్తించారు.



సాక్షి పరిశీలన

వేములకుర్తిలోని రైస్‌మిల్లులో బియ్యం పట్టుకున్న పోలీసులు(ఫైల్)

మెట్‌పల్లి: పేదలకు ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేస్తున్న రేషన్‌బియ్యం పెద్ద ఎత్తున పక్కదారి పడుతోంది. డీలర్లు, లబ్ధిదారుల నుంచి సేకరించి కొందరు స్థానికంగా ఉన్న మిల్లర్లు, ఫౌల్ట్రీఫాంలకు విక్రయించడమే కాకుండా ఇతర రాష్ట్రాలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. దీనిని అడ్డుకోవాల్సిన సివిల్ సప్లయ్ అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. దీంతో ఈదందా జిల్లాలో దర్జాగా సాగుతోంది.

మక్కల స్థానంలో బియ్యం వినియోగం

- ఫౌల్ట్రీఫాం యజమానులు సాధారణంగా కోళ్లకు దాణా కింద మక్కలను వినియోగిస్తారు.
- ఇటీవల మార్కెట్‌లో మక్కల ధర భారీగా పెరిగింది. గతంలో క్వింటాల్‌కు రూ.2వేల వరకు ఉండగా.. ప్రస్తుతం రూ.మూడు వేల వరకు పలుకుతోంది.
- దాణాకు అయ్యే పెట్టుబడి వ్యయాన్ని తగ్గించుకునేందుకు మక్కల స్థానంలో తక్కువ ధరకు దొరికే రేషన్ బియ్యాన్ని వాడుతున్నారు.
- బియాన్ని దళారుల నుంచి క్వింటాల్‌కు రూ.1200 నుంచి రూ.1500 చొప్పున కొనుగోలు చేస్తున్నట్లు తెలిసింది.
- మక్కల ధరతో పోల్చితే రేషన్ బియ్యం ద్వారా క్వింటాల్‌కు రూ.1500వరకు ఆదా అవుతోంది.
- దీంతో చాలామంది ఫౌల్ట్రీ వ్యాపారులు రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేస్తున్నారని తెలిసింది.
- వేములకుర్తిలో రెండు ఫౌల్ట్రీల్లో బియ్యం పట్టుకున్న పోలీసులకు ఆ తర్వాత జరిపిన విచారణలో నెలకు వేలాది క్వింటాళ్ల బియ్యం తరలిస్తున్నరని గుర్తించారని సమాచారం.

జాడ లేని సివిల్ సప్లయ్ అధికారులు

- రేషన్ బియ్యం పక్కదారి పట్టకుండా చూడాల్సిన బాధ్యత ప్రధానంగా సివిల్ సప్లయ్ శాఖ అధికారులపై ఉంటుంది.
- జిల్లాలో ఆ శాఖ అధికారులు ఈ విషయంలో పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.
- రేషన్ దందాపై నిఘా పెట్టిన మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి కేవలం రెండు రోజుల్లోనే నాలుగు చోట్ల పెద్ద మొత్తంలో బియ్యాన్ని పట్టుకున్నారు.
- సివిల్ సప్లయ్ అధికారులు మాత్రం ఇటీవల కాలంలో ఎక్కడా బియ్యం పట్టుకున్న దాఖలాలు లేకపోవడం గమనార్హం.
- ఈ అక్రమ దందాకు సంబంధించిన సమాచారం వారి వద్ద ఉన్నా పట్టించుకోవడం లేదని, దీనికి మామూళ్లే కారణమనే ఆరోపణలున్నాయి.

బియ్యం దారితప్పిస్తే చర్యలు



రేషన్ బియాన్ని ప్రభుత్వం పేదల కోసం పంపిణీ చేస్తుంది. వాటిని ఎవరైనా పక్కదారి పట్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే కొందరిపై కేసులు పెట్టడమే కాకుండా వాహనాలను సీజ్ చేశాం. కొనుగోలు, విక్రయాలు మానుకోవాలి. లేకుంటే చట్టపరంగా ఇబ్బందులు తప్పవు.

– నిరంజన్‌రెడ్డి, మెట్‌పల్లి సీఐ

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఇద్దరు విద్యార్థినులు



రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు శ్రీవేద, శరణ్య

కథలాపూర్: కథలాపూర్ మండలం భూషణరావుపేట జెడ్పీ హైస్కూల్‌కు చెందిన గడ్డం శ్రీవేద, అంబారిపేట జెడ్పీ హైస్కూల్‌కు చెందిన చింత శరణ్య రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు పీడీలు రాజేశ్, చిన్నారెడ్డి తెలిపారు. వీరు కరీంనగర్‌లో జరిగిన ఖోఖో పోటీల్లో ప్రతిభ చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని పేర్కొన్నారు. వీరిని ఎంఈవో ఆనందరావు అభినందించారు.

సారంగాపూర్ విద్యార్థినులు..



మైథిలి, రుచిత

సారంగాపూర్: సారంగాపూర్ ఉన్నత పాఠశాలకు చెందిన సీహెచ్.మైథిలి, జి.రుచిత ఈనెల 13, 14, 15 తేదీల్లో హైదరాబాద్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరిని హెచ్‌ఎం కిశోర్, ఫిజికల్ డైరెక్టర్ రవీందర్ అభినందించారు.

క్లుప్తంగా

వృద్ధురాలి ఆత్మహత్య

జగిత్యాల క్రైం: జగిత్యాల రూరల్ మండలంలోని చల్‌గల్‌కు చెందిన చింతలపల్లి సాయమ్మ (63) ఆత్మహత్య చేసుకుందని ఎస్సై సదాకర్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. సాయమ్మ ఇంట్లో కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. దీంతో ఆమె మనస్తాపానికి గురై, గురువారం ఉదయం క్రిమిసంహారక మందు తాగింది. స్థానికులు జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందింది. మృతురాలి కూతురు ఏనుగుల లత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

గుండెపోటుతో ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ మృతి


మహిపాల్‌రెడ్డి (ఫైల్)

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): మండలంలోని రేగడిమద్దికుంటకు చెందిన సుల్తానాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్, బీఆర్‌ఎస్ నాయకుడు అన్నాడి మహిపాల్‌రెడ్డి గుండెపోటుతో మృతి చెందారు. స్థానికుల వివరాల ప్రకారం.. మహిపాల్‌రెడ్డి జనగాం జిల్లా ఆలేరులో వ్యవసాయ భూమిని కౌలుకు తీసుకొని, సాగు చేస్తున్నారు. పంటకు గురువారం క్రిమిసంహారక మందు పిచికారీ చేసే క్రమంలో కూలీలకు సహాయం చేస్తుండగా ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. ఆస్పత్రికి తీసుకెళ్లగా గుండెపోటుతో మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతునికి భార్య శారద, ఇద్దరు కుమారులు ఉన్నారు. స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు మహిపాల్‌రెడ్డి కుటుంబసభ్యులను పరామర్శించి, ఓదార్చారు.

సింగపూర్‌లో కొత్తపేటవాసి..

- కుటుంబసభ్యులతో కలిసి అక్కడే నివాసం


కుటుంబసభ్యులతో నరేందర్‌రెడ్డి (ఫైల్)

వెల్గటూర్(ధర్మపురి): జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలంలోని కొత్తపేటకు చెందిన గోనె నరేందర్ రెడ్డి(50) సింగపూర్‌లో మృతిచెందాడు. మృతుడి బంధువుల వివరాల ప్రకారం.. నరేందర్ రెడ్డి 1995 నుంచి కొన్నేళ్లు సింగపూర్ వెళ్లాడు. తర్వాత అక్కడే శాశ్వత నివాసం ఏర్పాటు చేసుకొని, కుటుంబసభ్యులతో కలిసి ఉంటున్నాడు. ఈ క్రమంలో బుధవారం రాత్రి 9 గంటలకు గుండెపోటు రావడంతో చనిపోయాడు. మృతుడికి భార్య రజిత, కుమారుడు సాయి, కూతురు కమిలిని ఉన్నారు.

నిమజ్జనాన్ని ప్రశాంతంగా నిర్వహించుకోవాలి


ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్‌లో వివరాలు సేకరిస్తున్న డీఎస్పీ

ఇబ్రహీంపట్నం: వినాయక నిమజ్జనాలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని, అల్లర్లు, గొడవలకు పాల్పడొద్దని మెట్‌పల్లి డీఎస్పీ ఉమా మహేశ్వర్‌రావు అన్నారు. గురువారం పలు వినాయక మండపాలను పరిశీలించారు. నిర్వాహకులతో మాట్లాడారు. నిమజ్జనం సమయంలో డీజేలు వద్దని, చిన్న సౌండ్‌బాక్సులతో భక్తి, శ్రద్ధలతో శోభాయాత్ర చేపట్టాలని సూచించారు. డీజేలు వాడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. మద్యం సేవించి శోభాయాత్రలో పాల్గొనవద్దని సూచించారు. ముందుగా పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. వివిధ రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి, ఎస్సై అనిల్ పాల్గొన్నారు.

పాప మృతి.. డాక్టర్‌పై దాడి


పాప మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబసభ్యులు

- వైద్యుడి నిర్లక్ష్యం వల్లే చనిపోయిందని కుటుంబసభ్యుల ఆరోపణ
- పెద్దపల్లిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రి ఫర్నిచర్ ధ్వంసం
- కలెక్టర్, సీపీలకు ఐఎంఏ వైద్యుల ఫిర్యాదు
- నేటినుంచి వైద్యసేవల బంద్‌కు పిలుపు

సాక్షి, పెద్దపల్లి: ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్యుడి నిర్లక్ష్యం వల్లే తమ పాప మృతి చెందిందని కుటుంబసభ్యులు ఆరోపించారు. బంధువులతో కలిసి దవాఖానా ఫర్నిచర్ ధ్వంసం చేశారు. మృతురాలి తండ్రి డాక్టర్‌పై కత్తితో దాడి చేశాడు. ఈ ఘటన పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చోటుచేసుకుంది. పాప కుటుంబసభ్యుల వివరాల ప్రకారం.. పెద్దపల్లికి చెందిన ఎండీ.ఖదీర్-రేష్మాబేగం దంపతుల కూతురు అభియా(7 నెలలు)కు జ్వరం వచ్చింది. దీంతో స్థానిక ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించగా మూడు రోజుల చికిత్స అనంతరం డిశ్చార్జి అయ్యింది. అయితే, ఆ చిన్నారికి ఇంజెక్షన్ వేయాల్సి ఉండగా గురువారం మళ్లీ అదే దవాఖానాకు తీసుకెళ్లి, వేయించారు. కానీ, డాక్టర్ డోస్ ఎక్కువ ఇచ్చారు. తర్వాత పాపకు సీరియస్‌గా ఉందని, కరీంనగర్ ఆస్పత్రికి రెఫర్ చేశారు. తల్లిదండ్రులు కరీంనగర్ తరలిస్తుండగా ఆ చిన్నారి మార్గమధ్యలో చనిపోయింది. వారు మృతదేహంతో తిరిగి పెద్దపల్లి ఆస్పత్రికి చేరుకున్నారు. కుటుంబసభ్యులు, బంధువులతో కలిసి వైద్యుడి నిర్లక్ష్యం వల్లే తమ పాప మృతిచెందిందని ఆరోపించారు. వైద్యుడు రాజేశ్‌పై పాప తండ్రి కత్తితో దాడికి దిగాడు. డాక్టర్ రోడ్డుపై పరిగెత్తినా వెంటపడి, దాడి చేయడంతో ఆయన తీవ్రంగా గాయపడ్డాడు. అనంతరం సదరు డాక్టర్, సిబ్బంది అక్కడినుంచి పరారయ్యారు. దీంతో ఆగ్రహించిన బాధితులు ఆస్పత్రిలో ఫర్నిచర్ ధ్వంసం చేశారు. తమకు న్యాయం చేయాలంటూ సదరు దవాఖానా ఎదుట ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని, వారితో మాట్లాడారు.

కార్డియాక్ అరెస్ట్ అంటున్న ఐఎంఏ వైద్యులు

వైద్యుడిపై కత్తితో దాడి చేసిన పాప తండ్రి ఖదీర్‌పై ఐఎంఏ పెద్దపల్లి వైద్య బృందం కలెక్టర్ కోయ శ్రీహర్ష, రామగుండం సీపీ శ్రీనివాస్‌లకు ఫిర్యాదు చేసింది. అనంతరం అసోసియేషన్ అధ్యక్షుడు రమాకాంత్ మాట్లాడుతూ.. చిన్నారి డిశ్చార్జి అయ్యాక, తల్లిదండ్రులు తదుపరి చికిత్సలో భాగంగా ఆస్పత్రికి తీసుకువచ్చి, ఇంజెక్షన్స్ వేయిస్తున్నారని అన్నారు. గురువారం ఇంజెక్షన్ వేశాక పాపకు జ్వరం తగ్గడం లేదని చెప్పడంతో డాక్టర్ రాజేశ్ కరీంనగర్‌కు రెఫర్ చేశారని పేర్కొన్నారు. కరీంనగర్‌లో చికిత్స పొందాక ఆ చిన్నారి ఆరోగ్య కుదుటపడిందని, తర్వాత సడెన్‌గా కార్డియాక్ అరెస్ట్ అవడంతో చనిపోయిందన్నారు. డాక్టర్‌పై దాడి అమానవీయమని, ఆయన నాలుగు కత్తిపోట్లకు గురయ్యారని తెలిపారు.

నేడు చలో పెద్దపల్లి..

డాక్టర్‌పై దాడి ఘటనకు నిరసనగా శుక్రవారం చలో పెద్దపల్లికి పిలుపునిస్తున్నట్లు ఐఎంఏ అధ్యక్షుడు రమాకాంత్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా వైద్య సేవల బంద్ పాటిస్తున్నట్లు పేర్కొన్నారు. న్యాయం జరిగేవరకు వైద్య సేవలందించబోమన్నారు. వైద్యుడిని చంపేందుకు ప్రయత్నించిన ఖదీర్‌పై హత్యాయత్నం కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.


ధ్వంసమైన ఆస్పత్రి ఫర్నిచర్


ఆస్పత్రి ఎదుట ఆందోళనకారులను పంపిస్తున్న డీసీపీ చేతన, పోలీసులు


కలెక్టర్ శ్రీహర్షకు వినతిపత్రం ఇస్తున్న డాక్టర్లు

'నేను ఎస్సారార్ పూర్వ విద్యార్థిని'

- ఎమ్మెల్సీ ఎన్నికల్లో మద్దతు తెలపండి
- అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ నరేందర్ రెడ్డి


మాట్లాడుతున్న చైర్మన్ నరేందర్ రెడ్డి

కొత్తపల్లి(కరీంనగర్): తాను ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే ప్రఖ్యాతిగాంచిన శ్రీ రాజరాజేశ్వర ప్రభుత్వ(ఎస్ఆర్ఆర్) డిగ్రీ, పీజీ కళాశాల పూర్వ విద్యార్థినని అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ వి.నరేందర్‌రెడ్డి అన్నారు. కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా బరిలో నిలుస్తున్నానని, తనకు మద్దతు తెలపాలని కోరారు. ఈ మేరకు కరీంనగర్‌లోని ఎస్సారార్ కళాశాల అధ్యాపకులతో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తాను విద్యనభ్యసించిన కళాశాలకు రావడం ఆనందంగా ఉందని తెలిపారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తున్నందున ప్రభుత్వ లెక్చరర్లను కలిసి, మద్దతు కోరుతున్నానని, తనకు ఒక్క అవకాశం ఇవ్వాలన్నారు. ఎస్సారార్ కళాశాల నూతన భవన మంజూరు విషయాన్ని ప్రభుత్వంతో చర్చిస్తానని హామీ ఇచ్చారు. కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

నృసింహుని సేవలో రాజీవ్ కనకాల


రాజీవ్‌కు స్వామివారి శేషవస్త్రం, ప్రసాదం అందిస్తున్న ఈవో శ్రీనివాస్, వేదపండితులు

ధర్మపురి: స్థానిక శ్రీలక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో సినీనటుడు రాజీవ్ కనకాల గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధాన ఆలయంతోపాటు అనుబంధ ఆలయాల్లో స్వామివార్లను దర్శించుకున్నారు. ఆలయ ఈవో శ్రీనివాస్ ఆయనకు స్వామివారి శేషవస్త్రం కప్పి, చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు.

తెలియని ఫోన్ కాల్స్‌కు స్పందించొద్దు

- పోలీసుల పేరిట సైబర్ నేరగాళ్ల ఉచ్చు
- మోసపోతే వెంటనే 1930కు కాల్ చేయండి
- ఎస్పీ అశోక్‌కుమార్


మాట్లాడుతున్న ఎస్పీ అశోక్‌కుమార్

జగిత్యాల క్రైం: పోలీసుల పేరిట సైబర్ నేరగాళ్లు చేసే ఫోన్ కాల్స్‌పై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జగిత్యాల ఎస్పీ అశోక్‌కుమార్ అన్నారు. గురువారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. సైబర్ నేరాలకు గురైతే వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 1930కు కాల్ చేయడం లేదా ఎన్‌సీఆర్పీ పోర్టల్‌లో, ఠాణాలో ఫిర్యాదు చేయాలని సూచించారు. పోలీసులమని, మీరు లేక మీ కుటుంబ సభ్యులు ఏదో కేసులో ఇరుక్కున్నారని బెదిరించడం, డబ్బులు డిమాండ్ చేయడం, సైబర్ నేరాలకు పాల్పడేందుకు వ్యక్తిగత వివరాలు అడగడం, నంబర్ బ్లాక్ అవుతుందని బెదిరించడం వంటి కేసులు పెరిగిపోతున్నాయని పేర్కొన్నారు. ఇలాంటి ఫోన్ కాల్స్‌కు, గుర్తు తెలియని వ్యక్తులు చెప్పే మాటలు, ఫోన్‌లకు వచ్చే మెస్సేజ్‌లు, లింక్‌లకు స్పందించవద్దన్నారు. ఇంటర్నేషనల్ కాల్స్, కొత్త నంబర్ల నుంచి ఫోన్ వస్తే స్పందించొద్దని తెలిపారు. అజ్ఞాత వ్యక్తుల నుంచి కాల్స్ వస్తే వారికి ఎలాంటి వ్యక్తిగత వివరాలు ఇవ్వొద్దని, డ్రగ్స్ కేసు అని, ఉగ్రవాదులతో సంబంధాలని బెదిరించగానే భయపడి డబ్బులు బదిలీ చేయొద్దని సూచించారు. గొలుసుకట్టు మోసాలు, ఏదైనా కంపెనీ పేరుతో ముందుగా మీరు కొంత డబ్బు కట్టి జాయిన్ అవ్వండి.. ఆ తర్వాత అందులో మరో ముగ్గురిని జాయిన్ చేయిస్తే మీకు లైఫ్ లాంగ్ ఆదాయం ఉంటుందని చెప్పి మోసం చేస్తారన్నారు. అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే వీడియో కాల్స్ ఎత్తవద్దని తెలిపారు. ఎత్తితే వాళ్లు నగ్నంగా ఉండి, మీకు చేసిన వీడియో కాల్ రికార్డు చేసి, మిమ్మల్ని బెదిరించి డబ్బులు వసూలు చేస్తారన్నారు. వేలల్లో పెట్టుబడి.. లక్షల్లో లాభాలు అంటూ వచ్చే వాట్సాప్, టెలిగ్రాం ప్రకటనలను నమ్మొద్దన్నారు. ఉద్యోగం ఇస్తామంటూ మెస్సేజ్‌లు చేసి, డబ్బులు చెల్లించమంటే వారిని సైబర్ మోసగాళ్లు అని గ్రహించాలని పేర్కొన్నారు. మీ ప్రమేయం లేకుండా మీకు ఓటీపీ వస్తే దాన్ని ఎవరికీ చెప్పకండి.. అది సైబర్ నేరగాళ్ల ఎత్తుగడ కావొచ్చని భావించాలని సూచించారు.

గంజాయి విక్రేతల అరెస్టు

- నిందితుల్లో ఒకరు మైనర్

కోరుట్ల: గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్టు చేశామని, వారిలో ఒకరు మైనర్ అని మెట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు తెలిపారు. కోరుట్ల సర్కిల్ పోలీస్ కార్యాలయంలో గురువారం వివరాలు వెల్లడించారు. కోరుట్ల పట్టణంలోని అల్లమయ్య గుట్టకు చెందిన గంధం అనిల్, మరో బాలుడు చెడు వ్యసనాలకు అలవాటు పడ్డారు. రెండు నెలలుగా మహారాష్ట్రలోని నాందేడ్ నుంచి గంజాయిని తక్కువ ధరకు తీసుకువచ్చి, కథలాపూర్, వేములవాడ మండలాల్లో ఎక్కువ ధరకు విక్రయిస్తున్నారు. ఈ క్రమంలో మూడు రోజుల క్రితం గంజాయి తీసుకువచ్చి కథలాపూర్ వైపు బైక్‌పై వెళ్తుండగా.. కోరుట్ల పట్టణ శివారులో పోలీసుల తనిఖీల్లో పట్టుబడ్డారు. వారి వద్ద 360 గ్రాముల గంజాయి దొరికింది. ఒకరిని కోర్టులో హాజరుపరిచి, మరొకరిని జువెనైల్ హోంకు తరలించామని డీఎస్పీ పేర్కొన్నారు. సీఐ సురేశ్‌బాబు, ఎస్సైలు శ్రీకాంత్, శ్వేత, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి

అడిషనల్ కలెక్టర్ గౌతమ్‌రెడ్డి


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ గౌతంరెడ్డి

రాయికల్: పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ గౌతమ్ రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని ఒడ్డెలింగాపూర్, వస్తాపూర్, కట్కాపూర్, మైతాపూర్, అయోధ్య, రాజనగర్ గ్రామపంచాయతీలను సందర్శించారు. కార్యదర్శులు ఎప్పటికప్పుడు మురికి కాలువల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లించాలని సూచించారు. ఇంటి పన్ను వసూళ్లు వందశాతం పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామాల్లో చేపడుతున్న ఆదర్శ పాఠశాల పనులను వేగవంతం చేయాలన్నారు. ఆయన వెంట ఎంపీడీవో చిరంజీవి, ఎంపీవో సుష్మా, పంచాయతీరాజ్ ఏఈ ప్రసాద్ పాల్గొన్నారు.

బీసీ కులగణన పూర్తి చేయాలి


మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

జగిత్యాలటౌన్: హైకోర్టు తీర్పు మేరకు మూడు నెలల్లో బీసీ కులగణన పూర్తి చేయాలని సంఘం రాష్ట్ర కార్యదర్శి ముసిపట్ల లక్ష్మీనారాయణ ప్రభుత్వాన్ని కోరారు. గురువారం జిల్లాకేంద్రంలో మాట్లాడారు. ఐదేళ్ల క్రితం బీసీ కులగణనపై రిట్ పిటిషన్ దాఖలైనప్పటికీ గత ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయకుండా నిర్లక్ష్యం వహించిందన్నారు. మొక్కవోని ధైర్యంతో బీసీ సంఘాలు పోరాటం చేశాయని గుర్తు చేశారు. సమగ్ర కులగణన జరిపి 42శాతం బీసీ రిజర్వేషన్‌తో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని కోరారు. సమావేశంలో కొక్కు గంగాధర్, తిరుపురం రాంచంద్రం,మారిశెట్టి సూర్యప్రకాశ్, బండపెల్లి మల్లీశ్వరి, రాపర్తి రవి తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం

- మరొకరికి తీవ్ర గాయాలు
- మొక్కజొన్న పంటకు కాపలావెళ్తుండగా ఢీకొన్న లారీ


చిన్న లింబన్న (ఫైల్)

మల్లాపూర్(కోరుట్ల): రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందగా మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఎస్సై కిరణ్‌కుమార్ కథనం ప్రకారం.. మండలంలోని మొగిలిపేటకు చెందిన రాణవేని చిన్న లింబన్న(60), మల్యాల లింగులు మొక్కజొన్న పంటకు కాపలా ఉండేందుకు గురువారం ద్విచక్రవాహనంపై బయలుదేరారు. రోడ్డుపైకి రాగానే ఖానాపూర్ నుంచి మెట్‌పల్లి వైపు వెళ్తున్న లారీ అతివేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ఘటనలో చిన్న లింబన్న అక్కడికక్కడే మృతిచెందాడు. లింగులును ఆస్పత్రికి తరలించారు. చిన్న లింబన్న మృతదేహానికి పోస్టుమార్టం జరిగింది. మృతుడి భార్య రాజగంగు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు.

విషజ్వరాలపై అప్రమత్తంగా ఉండాలి



జగిత్యాలరూరల్: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా మాతా శిశు సంక్షేమాధికారి జైపాల్‌రెడ్డి అన్నారు. గురువారం జగిత్యాల అర్బన్ మండలం గోపాల్‌రావుపేట గ్రామంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికి వైద్య సిబ్బంది సర్వే చేసి జ్వర పీడితులను గుర్తించి వారికి వైద్య పరీక్షలు చేశారు. ప్రతి వ్యక్తి ఇంట్లో పరిశుభ్రత పాటించాలని, ఇంటి పరిసర ప్రాంతాల్లో మురికినీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రధాన రహదారి వెంటనున్న మురికిగుంతల్లో ఆయిల్‌బాల్స్ వేసి దోమల నివారణకు పటిష్ఠ చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో విషజ్వరాలు ప్రబలుతున్న నేపథ్యంలో వైద్య సిబ్బంది 24 గంటల పాటు అందుబాటులో ఉంటూ ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నట్లు వెల్లడించారు. సూపర్‌వైజర్లు శ్యామ్, శ్రీనివాస్, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

ప్రతీరోజు కొడుతుంది.. తిడుతుంది

- పీఈటీ మేడం చేతిలో దెబ్బలు తిన్నోళ్లు ఎంతోమంది ఉన్నారు..
- భరించలేకనే మేము నోరు విప్పాం
- ఇందిరమ్మ కాలనీ గురుకుల విద్యార్థినులు


సిరిసిల్ల ఆస్పత్రికి వచ్చిన విద్యార్థినులు

సిరిసిల్లటౌన్: పీఈటీ జ్యోత్స్న మేడం వల్ల మేము ప్రతీరోజు భయంభయంగా ఉంటున్నం.. ఎందుకు కొడుతుందో తెల్వదు.. మా బాధలు తెలుసుకునే ప్రయత్నం చేయదు.. కేవలం ఆమె ధోరణిలోనే ఆదేశాలు ఇస్తూ.. మమ్మల్ని తిడుతూ కొడుతోంది. మేమే కాదు.. ఆమె చేతిలో దెబ్బలు తిన్నోళ్లు చాలా మంది ఉన్నారు.. అధ్యాపకులు, ఉపాధ్యాయుల భయంతో బయటకు రావడం లేదు.. మేము తట్టుకోలేక చెప్పుకుంటున్నాం.. ఇంకెప్పుడూ విద్యార్థినులను కొట్టకుండా చూడాలంటూ తంగళ్లపల్లి మండలం ఇందిరమ్మ కాలనీ తెలంగాణ గిరిజన సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థినులు కోరారు. గురువారం చికిత్స నిమిత్తం సిరిసిల్ల ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చిన సందర్భంగా 'సాక్షి'తో తమ గోడు వెల్లబోసుకున్నారు.

మా బాధలు పట్టించుకోదు

మా పీఈటీ మేడం మా బాధలు అస్సలు పట్టించుకోదు. మేము ఏం చెప్పినా వినదు. ఆమె వల్ల ప్రతీరోజు టార్చర్ పడుతున్నాం. విద్యార్థినులు వందల సంఖ్యలో ఉన్నారు.. కాలకృత్యాలు తీర్చుకోవడం ఆలస్యమవుతుంది కదా.. అన్న ధ్యాస కూడా ఆమెకు ఉండదు.

– బానోతు అశ్విని

చెప్పుకోలేని మాటలు

కొన్ని సందర్భాల్లో మా బాధలు పీఈటీ మేడంకు చెప్పుకోలేక అవస్థలు పడుతున్నాం. ఆడపిల్లల బాధలను అర్థం చేసుకోవాలి కదా.. బయటకు చెప్పుకోలేని మాటలు అంటోంది. ఎక్కడెక్కడ కొట్టేదో.. తలుచుకుంటే భయంగా ఉంది. ఇంత టార్చర్ ఎవ్వరూ పెట్టరు.

– బాదావత్ మధుశ్రీ

పర్మిషన్‌తోనే పోయినం

మా ఫ్రెండ్‌కు కడుపు నొప్పిగా ఉంటే డ్యూటీ మేడం పర్మిషన్‌తోనే రూములకు పోయినం. ప్రార్థన సమయానికి లేట్ అయిందని మేడం వచ్చి, చితకబాదింది. ఒక్కొక్కరి రూము తలుపులు తెరుస్తూ.. వీడియోలు తీస్తూ కొట్టింది. ఆమె మాటలు వినలేకపోతున్నాం.

– గుగులోతు తేజశ్రీ

మేడంను సస్పెండ్ చేయాలి

ఇష్టం వచ్చినట్లు ప్రవర్తించే పీఈటీ జ్యోత్స్న మేడంను సస్పెండ్ చేయాలి. మాకు నీటి వసతి సరిగా లేదు. ఎక్కువ మంది విద్యార్థినులం ఉన్నా అర్థం చేసుకొని అడ్జస్ట్ అవుతున్నాం. ఒక టీచర్‌కు ఉండాల్సిన క్వాలిటీస్ ఆమెకు లేవు. దెబ్బలు తిన్న వాళ్లు స్కూల్లోనే ఉన్నారు.

– భూక్య అశ్విని

సంచిలో మూటగట్టి.. కాలువ గట్టున పడేసి

- కాకతీయ కాలువ పక్కన పసికందు గుర్తింపు
- పోలీసులకు సమాచారం ఇచ్చిన రైతు
- కరీంనగర్ జిల్లా తుమ్మనపల్లి శివారులో ఘటన


మగ శిశువు

హుజూరాబాద్‌రూరల్: ఎక్కడ పుట్టాడో తెలీదు. ఎవరి బిడ్డో జాడలేదు.. ఐదు రోజుల పసికందును గుర్తు తెలియని వ్యక్తులు సంచిలో మూటగట్టి తీసుకొచ్చి, కాలువ గట్టున పడేశారు. ఆ బాలుడి ఏడుపును గమనించిన ఓ రైతు పోలీసులకు సమాచారం ఇచ్చాడు. వారు వెంటనే ఆ పసికందును ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటన కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ మండలం తుమ్మనపల్లి గ్రామ శివారులో గురువారం చోటుచేసుకుంది. గ్రామస్తులు, పోలీసుల వివరాల ప్రకారం.. తుమ్మనపల్లికి చెందిన రైతు గుండేటి బక్కారెడ్డి తన ట్రాక్టర్‌ను శుభ్రం చేసుకునేందుకు గ్రామ శివారులోని కాకతీయ కాలువ వద్దకు వెళ్లాడు. ర్యాంపులోకి దిగి ట్రాక్టర్ కడుగుతున్నాడు. ఆ సమయంలో కాలువ గట్టున పొదల్లో నుంచి పసికందు ఏడుపు వినిపించింది. వెంటనే ఆయన అక్కడికి వెళ్లి చూడగా సంచిలో మగ శిశువు కనిపించాడు. వెంటనే గ్రామస్తుల సహకారంతో పోలీసులకు సమాచారం ఇచ్చాడు. సీఐ తిరుమల్ వచ్చి, శిశువును తన కారులో హుజూరాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. శిశువును దూరం నుంచి విసిరేయడంతో చిన్నచిన్న గాయాలయ్యాయని వైద్యులు తెలిపారు. పుట్టి ఐదు రోజులు అవుతోందన్నారు. ప్రస్తుతం ఐసీయూలో చికిత్స అందిస్తున్నారు. ఆరోగ్యం మెరుగుపడిన తర్వాత కరీంనగర్‌లోని శిశువిహార్‌కు తరలిస్తామని ఐసీడీఎస్ సీడీపీవో సుగుణ పేర్కొన్నారు.

కార్మికుల శ్రమ దోపిడీ ఆపాలి

- బీడీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాములు
- నాసిరకం ఆకు సరఫరాపై కార్మిక శాఖ అధికారులకు ఫిర్యాదు



కార్మిక శాఖ అధికారులకు ఫిర్యాదు చేస్తున్న బీడీ సంఘం నాయకులు

కోరుట్లరూరల్: బీడీ యాజమాన్యం కార్మికుల శ్రమ దోపిడీని ఆపాలని బీడీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుతారి రాములు అన్నారు. కార్మిక శాఖ అధికారులకు గురువారం ఫిర్యాదు చేశారు. దేశాయి బీడీ ఫ్యాక్టరీని నమ్ముకుని కోరుట్ల రేంజ్ పరిధిలో సుమారు 12వేల మంది బీడీలు చుడుతూ కుటుంబాలను పోషించుకుంటున్నారని, తునికాకు నాసిరకం కావడంతో వెయ్యిబీడీలకు యాజమాన్యం ఆకు ఇస్తే కేవలం 500 బీడీలే అవుతున్నాయని, మిగతా బీడీల కోసం కార్మికులు ఆకు కొనుగోలు చేయాల్సి వస్తోందని తెలిపారు. తద్వారా కార్మికులు నష్టపోతున్నారని పేర్కొన్నారు. యాజమాన్యం సరఫరా చేసే ఆకు దొడ్డు, నలుపు, పగులుగా ఉండటంతో కార్మికులు సొంతంగా ఆకు కొనుగోలు చేసి నష్టాన్ని పూడ్చుతున్నారని తెలిపారు. దేశాయి బీడీ కంపెనీ నుంచి తయారు చేసే వివిధ రకాలు చిప్స్, స్వీట్స్ కార్మికులకు అంటగట్టి డబ్బులు దండుకుంటున్నారన్నారు. దీనిపై చర్యలు తీసుకోవాలని లేబర్ అధికారులను కోరారు. కార్మిక సంఘం జిల్లా అధ్యక్షురాలు కొక్కుల శాంత, ఎండీ.మౌలాన, ముక్రం, ఉస్మాన్, ఎన్నం రాధ పాల్గొన్నారు.

216 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత


బియ్యం లారీ వద్ద సివిల్ సప్లయ్ అధికారులు


బియ్యం చూపుతున్న ఎస్సై కిరణ్‌కుమార్

జగిత్యాలరూరల్: రేషన్ బియ్యం పక్కదారి పట్టిస్తే చర్యలు తప్పవని జగిత్యాల జిల్లా పౌరసరఫరాల అధికారి జితేందర్‌రెడ్డి హెచ్చరించారు. గురువారం మేడిపల్లి మండలంలోని మాచాపూర్‌లో శ్రీ రేణుక రైస్‌మిల్లులో తనిఖీలు చేపట్టామన్నారు. మిల్లులో అక్రమంగా నిల్వ ఉంచిన 176.60 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని, లారీని సీజ్ చేసి, 6ఎ కేసు నమోదు చేశామని పేర్కొన్నారు. బియ్యాన్ని కోరుట్ల ఎంఎల్ఎస్ గోదాంకు, లారీని మేడిపల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించామని తెలిపారు. రైస్‌మిల్లర్లు ప్రభుత్వ నిబంధనల ప్రకారం నడుచుకోవాలని, ఎలాంటి పొరపాట్లు చేసినా చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్లు, సివిల్ సప్లయ్ అధికారులు పాల్గొన్నారు.

మెట్‌పల్లిరూరల్: పీడీఎస్ బియ్యాన్ని పక్కదారి పట్టిస్తే ఎంతటి వారినైనా వదిలిపెట్టేది లేదని మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. గురువారం ఓ వ్యాన్‌లో తరలిస్తున్న 30 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని విట్టంపేట శివారులో పట్టుకున్నట్లు పేర్కొన్నారు. వెల్లుల, జగ్గాసాగర్ గ్రామాల్లో సేకరించి, మోర్తాడ్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు. మోర్తాడ్‌కు చెందిన సయ్యద్ ముజీబ్, రఫీలపై కేసు నమోదు చేశామని, బియ్యాన్ని సివిల్ సప్లయ్ అధికారులకు అప్పగించామన్నారు. వ్యాన్ ఓనర్ షేక్ నసీర్ పరారీలో ఉన్నాడని తెలిపారు.

మల్లాపూర్ మండల కేంద్రంలో..

మల్లాపూర్(కోరుట్ల): మల్లాపూర్ మండల కేంద్రంలో బుధవారం అర్ధరాత్రి స్థానికుడు శనిగారపు రాజేందర్ షెడ్డులో నిల్వ ఉంచిన 10 క్వింటాళ్ల బియ్యాన్ని పట్టుకున్నట్లు మెట్‌పల్లి సీఐ నిరంజన్ రెడ్డి తెలిపారు. పీడీఎస్ బియ్యాన్ని నిల్వ ఉంచారన్న విశ్వసనీయ సమాచారంతో వెళ్లి, దాడి చేశామన్నారు. రాజేందర్‌కు చెందిన షెడ్డులో 10 క్వింటాళ్ల బియ్యం లభ్యమయ్యాయని పేర్కొన్నారు. అక్రమంగా బియ్యం నిల్వ ఉంచిన ఆకుల శ్రీకాంత్, పస్తం రాజేశ్‌లతోపాటు కొనుగోలు చేస్తున్న నిర్మల్ జిల్లా ఖానాపూర్‌కు చెందిన ప్రభాకర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు.